క్లుప్తంగా

పాడి పరిశ్రమపై దృష్టి సారించాలి

జైనథ్: కేంద్ర ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న వ్యవసాయ పనిముట్లపై, కేంద్రం తగ్గించిన జీఎస్టీ విషయంపై శనివారం దేశమంతా రైతులతో నరేంద్ర మోదీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మండల కేంద్రంలో రైతువేదికలో ఫసల్ బీమా, పాడి పరిశ్రమ గురించి వివరించారు. జీఎస్టీ తగ్గించడంతో వ్యవసాయ పనిముట్ల ధరలు తగ్గాయన్నారు. కార్యక్రమంలో జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి అశోక్ రెడ్డి, మార్కెట్ కమిటీ సెక్రటరీ దేవన్న, రైతులు స్వామి యాదవ్, వెంకన్న, బిక్కిపో చన్న పాల్గొన్నారు.

ఘనంగా బతుకమ్మ సంబురాలు


బతుకమ్మ ఆడుతున్న మహిళలు

భీంపూర్: మండలంలోని పిప్పల్‌కోటి గ్రామంలో బతుకమ్మ సంబురాలను శనివారం ఘనంగా నిర్వహించారు. తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి, గౌరమ్మకు పూజలు చేశారు. బతుకమ్మలను ఒకచోట చేర్చి ఆడిపాడారు. అనంతరం బతుకమ్మలను డప్పుల చప్పుళ్లతో ఊరేగింపుగా తీసుకెళ్లి సమీపంలోని వాగుల్లో, చెరువుల్లో నిమజ్జనం చేశారు.

ఆలయ అభివృద్ధికి కృషి

తలమడుగు: మండలంలోని బరంపూర్ సమీపంలో కొండపై స్వయంభుగా వెలిసిన శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఆదిలాబాద్ ఎంపీ గేడం నగేశ్ అన్నారు. శనివారం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. తెలంగాణ తిరుపతిగా ఆధ్యాత్మిక కేంద్రంగా బరంపూర్ ఆలయం అభివృద్ధి చెందుతుందన్నారు. గతంలో ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఆలయ అభివృద్ధికి కృషి చేయడం జరిగిందని గుర్తుచేశారు. అనంతరం కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీలు గోక గణేశ్‌రెడ్డి, రాజు, ఆలయ కమిటీ అధ్యక్షుడు కేదారేశ్వర్ రెడ్డి, మౌనిష్‌రెడ్డి, మల్లేష్, వెంకటస్వామి, చంద్రకాంత్, నారాయణరెడ్డి, కృష్ణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

సైన్స్‌పై అవగాహన పెంచుకోవాలి

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థులు సైన్స్‌పై అవగాహన పెంచుకునేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా సైన్స్ అధికారి అరె భాస్కర్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని కాన్వెంట్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సైన్స్ ఫెయిర్‌కు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు తయారు చేసిన ప్రదర్శనలను తిలకించి వాటి ఉపయోగాల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ లిజంటో, ప్రిన్సిపాల్ మరియ రోజ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'కపాస్ కిసాన్' యాప్‌తో రైతులకు నష్టం

బోథ్: సీసీఐ పత్తి కొనుగోళ్లకు 'కపాస్ కిసాన్' యాప్ ద్వారా స్లాట్ బుకింగ్ విధానాన్ని తీసుకురావడంతో రైతులు నష్టపోతారని బోథ్ డివిజన్ ఆత్మ చైర్మన్ గొర్ల రాజు యాదవ్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. అధిక వర్షాల కారణంగా దిగుబడి తగ్గడంతో రైతులు ఇప్పటికే ఇబ్బందుల్లో ఉన్నారని, ఇలాంటి యాప్‌లు, నిబంధనలు సరికాదన్నారు. పత్తిలో తేమశాతం 12 శాతానికి మించరాదన్న నిబంధనను సడలించాలని డిమాండ్ చేశారు. రైతులు దళారుల చేతుల్లో మోసపోయే ప్రమాదం ఉందన్నారు.

'మూడు కులాలకు అన్యాయం'

ఆదిలాబాద్‌రూరల్: వాల్మీకి, కైతీ లభాన, మాలీ (బారే) మూడు కులాలను ఎస్టీ జాబితాలో చేర్చకుండానే 10 శాతం గిరిజన రిజర్వేషన్లను ప్రభుత్వం అమలు చేస్తుందని, మూడు కులాలకు తీరని అన్యాయం జరుగుతుందని అఖిల భారతీయ మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పెట్కులే అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో మాట్లాడారు. మూడు కులాలను కలిపి 10 శాతం రిజర్వేషన్లను అమలు చేయాల్సి ఉండగా వాటిని పక్కనపెట్టి అమలు చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. సమావేశంలో సాంబన్న షిండే, సురేశ్, మురళీధర్, ధనంజయ్, భాస్కర్, రాములు, రామకృష్ణ పాల్గొన్నారు.

108లో ప్రసవం

ఉట్నూర్‌రూరల్: మండలంలోని హీరాపూర్ గ్రామానికి చెందిన పుస్నక గోదావరికి శనివారం పురిటి నొప్పులు రావడంతో కుటుంబీకులు ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చారు. అక్కడ పరీక్షలు చేసిన వైద్యులు ఆదిలాబాద్ రిమ్స్‌కి రెఫర్ చేశారు. 108లో తరలిస్తున్న క్రమంలో మార్గమధ్యలో పురుటి నొప్పులు ఎక్కువడంతో ఈఎంటీ దత్తాత్రేయ అంబులెన్స్‌లోనే పురుడు పోశారు. అనంతరం తల్లిబిడ్డలను ఇంద్రవెల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తల్లి బిడ్డ క్షేమంగా ఉన్నారని ఈఎంటీ దత్తత్రేయ, పైలెట్ మడావి బాపురావు, ఆశ వర్కర్ జయసుధా తెలిపారు.

పీహెచ్‌సీలో అరకొర వైద్యసేవలు

- వేధిస్తున్న సిబ్బంది కొరత
- ఇబ్బంది పడుతున్న రోగులు



తాంసి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

తాంసి: మండలంలోని పీహెచ్‌సీలో రోగులకు వైద్య సేవలు పూర్తిస్థాయిలో అందడం లేదు. ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నామని అధికారులు చెబుతున్నా.. ఆచరణలో మాత్రం కనిపించడం లేదు. సరిపడా వైద్య సిబ్బంది లేక వైద్యం అందని పరిస్థితి నెలకొంది. పోస్టులు ఖాళీగా ఉండటంతో ఆరోగ్య కేంద్రానికి వచ్చిన రోగులు ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుతం ఇద్దరు వైద్యాధికారులు ఉండగా.. ఒక వైద్యాధికారి నిత్యం వైద్య సేవలు అందిస్తుండగా.. మరొక అధికారి మూడు రోజులు తాంసి పీహెచ్‌సీలో, పక్క మండలంలోని ఆయుర్వేద వైద్యశాలలో విధులు నిర్వహిస్తున్నారు. అలాగే కిందస్థాయి సిబ్బంది కూడా సరిపడా లేరు.

ఖాళీగా ల్యాబ్ టెక్నీషియన్, స్టాఫ్ నర్స్‌పోస్టులు..

తాంసి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలను అందించేందుకు ఇద్దరు స్టాఫ్‌నర్స్‌లు ఉండాల్సి కానీ ఒక్కరూ మాత్రమే ఉన్నారు. ఓపీ ఏఎన్ఎం ఒకరు విధులు నిర్వహిస్తుంగా.. గత మూడు నెలల క్రితం పదోన్నతిలో భాగంగా ఇతర చోటుకు బదిలీ అయింది. అప్పటి నుంచి ఆ పోస్టు ఖాళీగా ఉంది. ల్యాబ్ టెక్నీషియన్‌కు సైతం పదోన్నతి రావడంతో జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి బదిలీ అయ్యారు. దీంతో వైద్య పరీక్షలకు ఇబ్బందిగా మారింది. స్టాఫ్ నర్స్ సెలవు పెడితే వైద్యం అందని పరిస్థితి. మండల కేంద్రంలో ఇటీవల ప్రారంభించిన పల్లె దవాఖానాలో సైతం సిబ్బంది లేక రోగులకు వైద్య సేవలు అందడం లేదు. ఏఎన్ఎం పోస్టు ఖాళీగా ఉండగా.. రెండో ఏఎన్ఎంతో పాటు ఆశ కార్యకర్తల ద్వారా వైద్య సేవలు అందిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తాంసి ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందిని పూర్తిస్థాయిలో నియమించి వైద్యం అందేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

అధికారుల దృష్టికి తీసుకెళ్తాం

ఆరోగ్య కేంద్రంలో రోగులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా వైద్య సేవలు అందిస్తున్నాం. ప్రస్తుతం ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్ టెక్నీషియన్‌తో పాటు ఓపీ ఏఎన్ఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. సరిపడా సిబ్బంది లేక పూర్తిస్థాయి వైద్య సేవలు అందించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

– శ్రావ్యవాణి, పీహెచ్‌సీ వైద్యాధికారి, తాంసి

విద్యాభివృద్ధికి పెద్దపీట


స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

ఇచ్చోడ: విద్యాభివృద్ధికి పెద్దపీట వేయనున్నట్లు బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలుర పాఠశాల. ఇచ్చోడ జిల్లా పరిషత్ పాఠశాలలను సందర్శించి, విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. తాను పదో తరగతి వరకు చదువుకున్న ఇచ్చోడ జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో రాష్ట్రంలోనే ఎక్కడా లేని విధంగా కార్పొరేట్ స్థాయికి మించి రూ. 5 కోట్లతో మోడల్ పాఠశాల భవనం నిర్మించనున్నట్లు తెలిపారు. చదువులో వెనకబడిన బోథ్ నియోజకవర్గానికి అత్యంత ప్రాధ్యానత ఇచ్చి ప్రభుత్వంతో మాట్లాడి రూ. 10.50 కోట్లు నిధులు మంజురు చేయించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, బీఆర్ఎస్ మండల కన్వీనర్ కృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి, గాడ్గే సూభాష్, తిరుమల్‌గౌడ్ పాల్గొన్నారు.

కాలనీల్లో తిరుగుతూ..

బోథ్: బోథ్ పట్టణాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసి 'మోడల్ బోథ్'గా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శనివారం ఆయన బోథ్ మండల కేంద్రంలో ఆకస్మికంగా పర్యటించారు. ఆర్అండ్‌బీ, పీఆర్ శాఖలకు చెందిన అధికారులతో కలిసి పట్టణంలోని కూడళ్లు, వీధులను, వివిధ కాలనీల్లోని రోడ్లను పరిశీలించారు. బీడీ కార్మికులు, స్థానికులతో ముచ్చటించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం క్యాంపు కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆర్అండ్‌బీ డీఈ అరవింద్, పీఆర్ డీఈ ధర్మేందర్, ఏఈ చంద్రశేఖర్, నాయకులు పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన

ఆదిలాబాద్‌టౌన్: పోషణ మాసంలో భాగంగా శనివారం ఆదిలాబాద్ పట్టణంలోని రాంనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పోషకాహారాన్ని తయా రు చేసి ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి సూ పర్‌వైజర్ అనిత హాజరై చిరుధాన్యాలు ఎలా వినియోగించుకోవాలో, ఆకుకూరల్లో ఏయే ప దార్థాలు లభిస్తాయనే దానిపై వివరించారు. అంగన్‌వాడీ టీచర్లు రాజ సులోచన, పుష్ప, లక్ష్మి, సౌజన్య, సరోజ, తదితరులు పాల్గొన్నారు.

బాలికల హక్కులను కాపాడాలి


బహుమతి అందజేస్తున్న డీసీపీవో రాజేంద్రప్రసాద్

ఆదిలాబాద్: బాలికల హక్కులను కాపాడాలని జిల్లా బాలల సంరక్షణ అధికారి రాజేంద్రప్రసాద్ అన్నారు. అంతర్జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా శనివారం జిల్లా కేంద్రంలోని క్రీడా పాఠశాలలో ష్యూర్ ఎన్జీవో ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలిక దినోత్సవం నిర్వహించారు. ఆడపిల్లల రక్షణ, సంరక్షణ కోసం ఎన్నో వ్యవస్థలు పని చేస్తున్నాయన్నారు. వారి కోసం ప్రత్యేకంగా జేజేబీ కోర్టు, చైల్డ్ లైన్, ఐసీపీఎస్, ష్యూర్ ఎన్జీవో వంటి ఎన్నో స్వచ్ఛంద సంస్థలు ఉన్నాయన్నారు. డీవైఎస్‌వో జక్కుల శ్రీనివాస్, ష్యూర్ ఎన్జీవో జిల్లా కోఆర్డినేటర్ వినోద్, క్రీడా పాఠశాల కోచ్ కబీర్ దాస్, పద్మ, చైల్డ్ హెల్ప్‌లైన్ సూపర్‌వైజర్ వెంకటేశ్, కిరణ్, సౌజన్య పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్: బాలికల హక్కులను కాపాడే బాధ్యత అందరిదని డీసీపీవో రాజేంద్రప్రసాద్ అన్నారు. అంతర్జాతీయ బాలిక దినోత్సవాన్ని శనివారం మహిళా, శిశు, వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ మిషన్ శక్తి– డీహెచ్ఈడబ్ల్యూ ఆధ్వర్యంలో బంగారిగూడలోని ఆదిలాబాద్ రూరల్ కేజీబీవీలో నిర్వహించారు. బాలికల్లోని ప్రతిభను వెలుగులోకి తీసుకొస్తు సమాన హక్కులతో కూడిన సమాజాన్ని నిర్మించడం అందరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ మిషన్ కో ఆర్డినేటర్ యశోద, సఖీ కేంద్రం కోఆర్డినేటర్ లావణ్య, పాఠశాల స్పెషల్ ఆఫీసర్ కవిత, లీగల్ కౌన్సిలర్ సంఘమిత్ర, కృష్ణవేణి, నిఖిలేశ్వర్, వెంకటేశ్ పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని శనివారం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. యాక్షన్ ఎయిడ్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో బాలికల సంరక్షణ, బాలికల ఆరోగ్యం గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో యాక్షన్ ఎయిడ్ హెచ్ఆర్‌డీ మర్సుకోల సరస్వతీ, దంతనపల్లి మెడికల్ ఆఫీసర్ విజయలక్ష్మి, మెడికల్ సూపరింటెండెంట్ సునీత. ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

సాలేగూడలో తాగునీటి కష్టాలు

- పని చేయని మంచినీటి పథకాలు
- బోరుబావే దిక్కు
- పట్టించుకోని అధికారులు


బోరుబావి నీటిని పట్టుకుంటున్న ప్రజలు

ఇంద్రవెల్లి: కాలమేదైనా మండలంలోని తెజాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని సాలేగూడ గ్రామస్తులు తాగునీటికి తండ్లాడుతున్నారు. గ్రామానికి మిషన్ భగీరథ నీరు సరఫరా కాక కిలోమీటర్ దూరంలో ఉన్నా.. బోర్‌బావి వద్ద నుంచి తాగు నీటిని తెచ్చుకుంటున్నారు. ఎడ్ల బండ్లు, బైక్‌లపై క్యాన్లలో నీటి తెచ్చుకుంటూ.. తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. సమస్యను పరిష్కరించాలని అధికారులకు విన్నవించినా.. ఎలాంటి ప్రయోజనం లేదని వాపోతున్నారు.

పనులు మానేసి..

సాలేగూడలో 120 ఆదివాసీ కుటుంబాలు, 450పైగా జనాబా ఉంటుంది. గ్రామంలో ఒక చేతి పంపు, మినీ ట్యాంక్ ఉంది. ట్యాంక్ నిర్మించి భగీరథ పైప్‌లైన్ కనెక్షన్ ఇచ్చినప్పటికీ నీటి సరఫరా నిలిచిపోయింది. గ్రామంలోని మంచినీటి పథకాలు పని చేయక.. భగీరథ నీరు రాకపోవడంతో తాగు నీటికి ఇబ్బంది పడుతున్నారు. పనులు మానేసి బోరు బావి వద్ద నుంచి నీటిని తెచ్చుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అధికారులు పట్టించుకోవడం లేదు



నీటి సమస్యను ఎవరు పట్టించుకోవడం లేదు. ఏదైనా పత్రికలో వార్త వచ్చినప్పుడు అధికారులు హడివిడి చేసి వెళ్తున్నారు. కానీ నీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించడం లేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు నీటి సమస్యను పరిష్కరించాలి

– మడావి కోసేరావ్, సాలేగూడ

దినమంతా నీటికోసం..



గ్రామంలో నీటి సౌకర్యం లేక పోవడంతో పనులు పక్కన పెట్టి దినమంతా తాగునీటి కోసం వెళ్తున్నాం. కిలోమీటర్ దూరంలో ఉన్న బోరుబావి నుంచి ఎడ్ల బండ్లు, బైక్‌లపై నీటిని తీసుకొచ్చి అవస్థలు పడుతున్నాం. ఎలాంటి పనులు చేయలేకపోతున్నాం.

– కుమ్ర మంతు, సాలేగూడ

ఓట్ చోరీకి వ్యతిరేకంగా సంతకాల సేకరణ


బోథ్: సంతకాలు సేకరిస్తున్న నాయకులు

సాత్నాల: భోరజ్ మండలంలోని గిమ్మ గ్రామంలో ఏఐసీసీ పిలుపుమేరకు శనివారం కాంగ్రెస్ నాయకులు సంతకాల సేకరణ చేపట్టారు. ముత్యాల అఖిలేష్ యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ సెక్రటరీ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేసే చర్యలు తక్షణమే ఆపాలని, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కాంగ్రెస్ నాయకులు రాజీవ్, గిమ్మ సంతోష్ పాల్గొన్నారు.

గుడిహత్నూర్: ఓటు చోరీని నిరసిస్తూ సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ఏఐసీసీ సభ్యుడు నరేశ్ జాదవ్ ప్రారంభించారు. ప్రతీ పౌరుడికి ఓటుహక్కు కల్పించడంతో పాటు తన ఓటును తానే స్వచ్ఛందంగా వేసుకునే పరిస్థితిని ఎన్నికల కమిషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మల్యాల కరుణాకర్, ఆసిఫ్, ఆడే శీల, బాలాజీ పటేల్, నాగ్‌నాథ్ అప్పా, అంకతి రవీందర్, తొడసం దౌలత్‌రావ్, ముస్తాఫా, చట్ల మహేందర్, శ్రీకర్ గౌడ్, సిడం లక్ష్మణ్, ఆడే సునీల్ పాల్గొన్నారు.

బోథ్: కాంగ్రెస్ నిర్వహిస్తున్న 'ఓటు చోరీ' కార్యక్రమాన్ని శనివారం ఏఐసీసీ సభ్యుడు నరేష్ జాదవ్ బోథ్ మండల కేంద్రంలో నిర్వహించారు. స్థానిక నాయకులతో కలిసి సంతకాల సేకరణ చేపట్టారు. కొందరు తమ స్వార్థం కోసం ఒకరి ఓటును మరొకరు వేస్తూ రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో బూర్గుల మల్లేష్, మల్లెపూలు సత్యనారాయణ, సల్ల రవి, కరుణాకర్, శేఖర్, సంజీవ్, చంద్రశేఖర్, దౌలత్ రావ్, నాగనాథ్, రాజేశ్వర్, శంషొద్దీన్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఐటీ ఉద్యోగుల క్రీడాపోటీలు


పోటీల్లో తలపడుతున్న ఉద్యోగులు

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియం, ఇండోర్ స్టేడియంలో ఐటీ ఉద్యోగుల క్రీడా పోటీలు శనివారం ఉత్సాహంగా సాగాయి. పోటీల్లో భాగంగా ఐటీ ఉద్యోగులు క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, క్యారం, చెస్ వంటి క్రీడా పోటీల్లో పోటాపోటీగా తలపడ్డారు. పోటీలను ఎన్టీటీ బిజినెస్ డాటా సొల్యూషన్స్ హెచ్ఆర్ మానస ప్రారంభించారు. ఉద్యోగుల్లో క్రీడా స్ఫూర్తి, పోటీతత్వం పెంపొందించాలనే ఉద్దేశంతో పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ఉద్యోగులు క్రీడల్లో పాల్గొంటే మానసికోల్లాసం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ఉద్యోగులు శ్రుతి, రజనీష్, యువరాజ్, ఖలీల్, మనస్విని పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న అన్నారు. శనివారం సీఐటీయూ కార్యాలయంలో గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ 5వ రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ప్రభుత్వం మల్టీపర్పస్ విధానాన్ని తీసుకువచ్చి కార్మికులకు రాని పనులను చేయిస్తుందని ఆరోపించారు. మహబూబాబాద్ జిల్లాలోని గార్ల మండలంలో మహాసభలు నిర్వహిస్తున్నట్లుగా పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఇంద్రాజ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రభాకర్, రవి, వెంకట్రావు, గంగన్న పాల్గొన్నారు.

'ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేసేందుకు కుట్ర'

ఆదిలాబాద్‌టౌన్: ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేసేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్రలు చేస్తున్నాయని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు దర్శనాల మల్లేష్ ఆరోపించారు. తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా మహాసభలను శనివారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించారు. ముందుగా కార్యాలయం ఎదుట జాతీయ కమిటీ సభ్యురాలు సునీత జెండా ఆవిష్కరించారు. గర్భిణులు, చిన్నారులకు అనేక సేవలందిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాల లక్ష్యాలను నీరుగార్చేలా ప్రతీ ఏటా బడ్జెట్‌లో కేంద్రం కోత విధిస్తుందని విమర్శించారు. ఆశన్న, అన్నమొల్ల కిరణ్, లింగాల చిన్నన్న, స్వామి, శోభ, గంగన్న, వెంకటమ్మ, సునీత, సుజాత, మనీషా, పాల్గొన్నారు.

నేడు విగ్రహా ప్రతిష్ఠాపన

బేల: మండలంలోని సదల్‌పూర్ రెవెన్యూ గ్రామ శివారులోని పురాతన బైరందేవ్ ఆలయంలో ఆదివారం బైరందేవ్ విగ్రహా ప్రతిష్ఠాపన మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు కొరంగే శ్యాంరావు, ప్రధాన కార్యదర్శి సిడాం కుషాల్‌రావులు శనివారం ఒక ప్రకటనలో తెలి పారు. తెల్లవారు 5గంటలకు విగ్రహా ప్రతిష్ఠాపన మహోత్సవం ప్రత్యేక పూజ, ఉదయం 9గంటలకు ప్రత్యేక హోమ కార్యక్రమం ఉంటుందన్నారు.

మున్నూరుకాపు రాష్ట్ర కార్యదర్శిగా తుల దత్తాత్రేయి

బోథ్: సొనాల మండల కేంద్రానికి చెందిన తుల దత్తాత్రేయి పటేల్‌ను మున్నూరుకాపు యువత రాష్ట్ర కార్యదర్శిగా నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజీవ్ పటేల్ తెలిపారు. శనివారం నియమాక పత్రాన్ని అందజేశారు.

నైపుణ్యం ఉంటేనే రాణించగలుగుతారు

బోథ్: నైపుణ్యం ఉంటే ఎక్కడైనా రాణించవచ్చని సాయిలింగి వృద్ధాశ్రమం వ్యవస్థాపకుడు, శ్రీరామ నంద తీర్థ పరిశీలకుడు దెబ్బది అశోక్ అన్నారు. బోథ్ మండల కేంద్రంలోని మాసం లక్ష్మి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో, శ్రీరామ నంద తీర్థ సహకారంతో నడుస్తున్న కుట్టుమిషన్ శిక్షణ కేంద్రం మొదటి బ్యాచ్ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్యార్థులకు త్వరలోనే సర్టిఫికెట్స్ అందజేస్తామని అన్నారు.

సామాజిక సేవకు పురస్కారం

ఉట్నూర్‌రూరల్: హైదరాబాదులోని పొట్టి శ్రీరాములు యూనివర్సిటీలో మాక్స్ గ్లోబల్ సంస్థ అవార్డుల ఎంపికలో ఉట్నూర్ మండలం లక్కారం గ్రామానికి చెందిన సామాజిక సేవకురాలు మర్సుకోల సరస్వతికి అవార్డు దక్కింది. శుక్రవారం రాత్రి ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, తెలంగాణ మాజీ స్పీకర్ మధుసూదాన చారి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.

ప్రభుత్వ ఫలాలు పేదలకు అందాలి

- ఎమ్మెల్యే పాయల్ శంకర్


భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

సాత్నాల: ప్రభుత్వ ఫలాలు నిరుపేదలకు రాజకీయాలకు అతీతంగా అందించాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. శనివారం భోరజ్ మండలంలోని పూసాయి, మాండగడ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లు, ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద మంజూరైన ఇళ్ల నిర్మాణాలకి, లబ్ధిదారులతో కలిసి భూమిపూజ చేశారు. ఇల్లు లేని నిరుపేదలు ఎవరూ ఉండకూడదనే ఉద్దేశంతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో దేశవ్యాప్తంగా ఇప్పటికే 4 కోట్ల 80 లక్షల ఇంటి నిర్మాణాలు చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అశోక్ రెడ్డి, తోట రమేశ్, గంగాధర్ సంజు, గణేష్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

నమ్మించి.. నట్టేట ముంచి

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో రోజురోజుకూ సైబర్ నేరాలు పెరుగుతున్నాయి. మోసగాళ్లు కొత్త పంథాల్లో అమాయకులను నట్టేటా ముంచుతున్నారు. పట్టణంలో తాజాగా వెలుగు చూసిన ఘటన మోసాలకు అద్దం పడుతోంది. టూ టౌన్ సీఐ కె.నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. మావల మండలంలోని వాఘాపూర్ గ్రామానికి చెందిన చాకటి శ్రీకాంత్ ఆటో నడుపుతూ జీవనోపాధి పొందుతున్నాడు. ఈనెల 4న స్థానిక భుక్తాపూర్ వద్ద ఓ వ్యక్తి వచ్చి ఫర్నిచర్ సామగ్రిని ఆటోలో తీసుకెళ్లాలని బేరం కుదుర్చుకున్నాడు. తన బైక్‌పై వచ్చిన నిందితుడు కొంత దూరం తీసుకెళ్లాకా మార్గమధ్యంలో స్నేహితుడికి ఫోన్‌కాల్ చేస్తానని చెప్పి బాధితుడి సెల్‌ఫోన్ తీసుకున్నాడు. ఫోన్‌ను ఎత్తుకెళ్లి ఫోన్ పే నుంచి రూ.51,600 నగదును కాజేశాడు. దీంతో బాధితుడు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టిన పోలీసులు నిందితుడి ఫోటోలతో కూడిన సీసీ ఫుటేజీని విడుదల చేశారు.

వైభవంగా రథోత్సవం


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణవాడ కాలనీలో గల ప్రాచీన శ్రీవేంకటేశ్వర, శ్రీ గోపాలకృష్ణ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీవారు, అమ్మవారి ఉత్సవ మూర్తులతో రథోత్సవాన్ని శోభయామానంగా చేపట్టారు. అంతకుముందు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గోవింద నామస్మరణతో కాలనీ వీధులు మార్మోగాయి. ఎమ్మెల్యే పాయల్ శంకర్ రథోత్సవంలో పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జిల్లాస్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు


ఎంపికైన క్రీడాకారులతో ఉపాధ్యాయులు

ఇచ్చోడ: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం అండర్ 14, 17 బాలుర విభాగంలో జిల్లాస్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు నిర్వహించారు. విద్యార్థులు పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను కనబర్చారు. ఎంపికైన క్రీడకారులకు మంచిర్యాలలోని గుడిపేటలో ఈనెల 14న నిర్వహించే జోనల్‌స్థాయి పోటీలలో పాల్గొననున్నారు. అందులో ఎంపికైన వారు 16న రంగారెడ్డిలో జిల్లాలోని పటాన్‌చెరువులో పాల్గొననున్నట్లు ఆదిలాబాద్ స్కూల్ గేమ్ సెక్రెటరీ రామేశ్వర్ తెలిపారు.